మందకొడిగా సాగుతూ..

- మెట్టలో కొనసాగుతున్న ఖరీఫ్ పనులు
- 19,898 ఎకరాల్లో వరినాట్లు పూర్తి
- వందశాతం అనుమానమే
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన



అల్లిపూడిలో ఆలస్యంగా ఖరీఫ్ వరినాట్లు వేస్తున్న రైతులు

తుని రూరల్: తొలకరి ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా మెట్టలో ఖరీఫ్ వరినాట్లు పూర్తికాలేదు. ఈ నెలాఖరుకు కూడా వందశాతం వరినాట్లు పూర్తవుతాయన్నది అనుమానమే. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో సాగునీటి వసతులు అంతంత మాత్రమే. ఏలేరు, పంపా, తాండవ రిజర్వాయర్లు, పీబీసీ, పుష్కర కాలువలు ఉన్నా వర్షాలు కురిస్తేనే ఆయకట్టుకు సాగునీరు చేరుతుంది. వర్షాలు కురవకపోతే ఆయా ప్రాజెక్టులు, కాలువల నుంచి పంటలకు సాగునీరు అందడం కష్టం. ఎగువ ప్రాంత ఆయకట్టుదారుల సాగునీటి అవసరాలు తీరితేనే దిగువకు నీరు ప్రవహిస్తుంది. వర్షాలు కురిస్తే ఎగువ ప్రాంతాల్లో ఆయకట్టుకు అంతగా నీటి అవసరాలు లేనప్పుడు దిగువకు కాలువలు ద్వారా నీరు శివారు భూములకు చేరుతుంది.

అడుగంటిన చెరువులు

మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా వర్షాలు కురవలేదు. సాగునీటి చెరువులన్నీ అడుగంటిపోయాయి. దీంతో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, మండలాల్లోని శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు, బోరుబావులు, కాలువల ద్వారా అరకొరగా అందుతున్న నీటితో కొంత మంది రైతులు నాట్లు వేస్తున్నారు. మిగిలిన రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

38,659 ఎకరాల్లో లక్ష్యం

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది 38,659 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయాలన్నది లక్ష్యం. ఇందులో 3500 ఎకరాల్లో పత్తి, 35,159 ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉంది. 2400 ఎకరాల్లో పత్తి సాగవుతుండగా ఇప్పటి వరకు 19,898 (56శాతం) ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. కోటనందూరు మండలంలో సాధారణ వర్షపాతం నమోదవగా తుని, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతోనైనా వర్షాలు కురుస్తాయని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరు, అక్టోబర్ మొదట వారం వరకూ నాట్లు పడే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

తుని సబ్‌డివిజన్‌లో సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు (ఎకరాల్లో)	నాట్లు వేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)	నాట్లు వేసిన రైతులు
తుని	6600	3085	2580
కోటనందూరు	9575	6370	4010
తొండంగి	13605	7825	5270
శంఖవరం	3605	1103	650
రౌతులపూడి	5273	1515	1060

నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం

తుని వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాలకు గాను నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు వరి, పత్తి, ఇతర పంటలు 60 శాతం సాగవుతున్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ప్రత్యామ్నాయ పంటలకు ప్రతిపాదనలు చేస్తాం. వర్షాధారంగా సాగు చేసే రైతులు అదును పదునూ చూసుకుని నాట్లు వేయాలి. నాటు వేస్తున్న రైతులు ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ చేయించుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఒంటిమామిడిలో బాధితులకు సాయం అందిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో అగ్ని ప్రమాద బాధితులకు బుధవారం పోలీసులు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన ధూళి సూర్యకాంతం ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. బాధితులకు స్థానిక ఎస్సై జి.వెంకటేశ్వరరావు రూ.15000 ఆర్థిక సహాయం అందించారు. స్ఫూర్తి ఫౌండేషన్ కో ఆప్షన్ సభ్యుడు రావి వెంకట్ రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు, నాగు రామకృష్ణ, మాణిక్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

రౌతులపూడి: మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని డీజేపురం, బిళ్లవాక, లచ్చిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని ఉద్యాన తోటలను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా, పంట నష్ట పరిహారం తదితర ప్రభుత్వ పథకాలను పొందవచ్చన్నారు. పలువురు ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

రౌతులపూడి: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మండల యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కె.హరిబాబు అధ్యక్షతన సంఘ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరోద్యోగ యువతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు ఆర్‌వీఆర్ మూర్తి, బి.తాతబాబు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



తహసీల్దార్ భీమారావుకు వినతిపత్రం అందజేస్తున్న గోవింద్

రౌతులపూడి: గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన గంపా సత్యవతి కుటుంబాన్ని ఆదుకోవాలని మాల మహానాడు జిల్లా కో ఆర్డినేటర్ చిట్టుమూరి గోవిందు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ బి.భీమారావుకు వినతి పత్రం అందజేశారు. మృతురాలు సత్యవతి భర్త తాతబాబు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఏ పని చేయలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్‌కు వివరించారు. ప్రభుత్వం వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మలమహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరుగా హిందూధర్మ ప్రచారం

ప్రత్తిపాడు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు అన్నారు. ప్రత్తిపాడులో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు ఇంటింటా ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీబస్వానంద భారతి స్వామీజీ, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బుడంకాయల వీర్రాజు, ధార్మిక జట్టు సభ్యులు దిడ్డి వెంకటరమణ, చిలకమర్తి బాబ్జి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



పాతకొట్టాంలో మృతుడి భార్యకు వైఎస్సార్ బీమా సొమ్ము అందిస్తున్న సర్పంచ్ వరహాలు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం గ్రామానికి చెందిన బండారు శ్రీను (42) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సహాయంగా రూ.10 వేలు మంజూరయ్యారు. బుధవారం సర్పంచ్ పసగడుగుల వరహాలు మృతుడి భార్యకు ఈ సొమ్మును అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము నామిని బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని బీమా సిబ్బంది తెలిపారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై హర్షం

జగ్గంపేట: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంపై బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ హర్షం వ్యక్తం చేశారు. జగ్గంపేటలో వివిధ వర్గాల మహిళలతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం మహిళా లోకం ఏళ్లతరబడి ఎదురు చూస్తోందన్నారు. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సామర్లకోట: స్థానిక భావయామి ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్ పోటీలు ఫోక్ డ్యాన్స్ విభాగంలో సామర్లకోట విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఎంపికైన విద్యార్థినులు విజయ లాస్య, శ్రీవల్లి, అభినయ, లీలాశ్రీ, యామినిలను ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి బూరయ్య, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వీర్రాజు అభినందించారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కిర్లంపూడిలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం
- 45 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చంటిబాబు



రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చంటిబాబు

జిల్లాకు: క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుతాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని జగపతినగరం తోట గోపాలకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, సీపీవో పి.త్రినాథ్, పౌరసరఫరాల శాఖ డీఎం డి.పుష్పమణి, పెద్దాపురం ఆర్డీవో జే.సీతారామారావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జరుగుతున్న జేకేసీ కార్యక్రమానికి హాజరయ్యే అధికారులందరూ మండల స్థాయి జేకేసీ కార్యాక్రమానికి హాజరవుతారన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్, ఉపాధి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సమస్యలకు 45 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. అనంతరం జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలో 12 గ్రామాలకు చెందిన 9047 భూహక్కు పత్రాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ, చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు, దోమాల గంగాధర్, పెనగంటి రాజేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



ఏలేశ్వరంలో తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

ఏలేశ్వరం: ఏలేశ్వరం పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 18వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్, 1వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభించామన్నారు. నిరంతర విద్యుత్ సరాఫరాకు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, సుంకర రాంబాబు, జువ్విన వీర్రాజు, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

జగ్గంపేట: కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, కాకినాడ జిల్లా ఇంచార్జ్ మలకల సూర్యప్రభాకర రావు ఆధ్వర్యంలో బుధవారం జగ్గంపేటలో ఆ సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. సంఘ జగ్గంపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా గవర సుధాకర్, ఉపాధ్యక్షులుగా సూరపురెడ్డి నరేష్, గాది రాంబాబును ఎన్నుకున్నారు. వీరికి ప్రభాకరరావు నియామక పత్రాలు అందజేశారు. అలాగే నియోజవర్గంలోని నాలుగు మండలాలకు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

జగనన్న కాలనీలో వసతుల కల్పనకు కృషి



గుమ్మళ్లదొడ్డి జగనన్న కాలనీలో గ్రావెల్‌రోడ్డుకు శంకుస్థాపన చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జగనన్న కాలనీలో సమస్యలపై ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించారు. మంగళవారం కాలనీని సందర్శించిన ఎంపీపీ, ఎంపీడీఓలకు కాలనీవాసులు పలు సమస్యలను వివరించారు. దీనిలో ప్రధానంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ సుంకర శ్రీవల్లి సమస్యను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బుధవారం కాలనీలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నవరత్నలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. సమస్యను వివరించిన వెంటనే స్పందించి గ్రావెల్‌రోడ్డు నిర్మాణం చేపట్టడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సమ్మెటి నాని, ఆకుల సుబ్రహ్మణ్యం, దాసరి విష్ణు, కార్యదర్శి రమణకుమారి, పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: స్థానిక ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ కె.శ్రీలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని మండలం డి.పోలవరం–5 (బీసీ–ఎ), ఆటికెవానిపాలెం (బీసీ–బి), తొండంగి మండలం పి.అగ్రహారం–1 (బీసీ–ఎ), కృష్ణాపురం–3 (బీసీ–ఈ) ఖాళీలు ఉన్నాయన్నారు. స్థానిక వివాహితులైన పదో తరగతి చదివిన మహిళలు అర్హులన్నారు. 2023 జూలై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29 లోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సీడీపీఓ పద్మావతి బుధవారం తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లి–2లో అంగన్‌వాడీ ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. పదో తరగతి పాసైన 21 నుంచి 35 సంవత్సరాల లోపు స్థానిక మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29 లోగా సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెదశంకర్లపూడిలో

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి బుధవారం తెలిపారు. పదో తరగతి పాసైన బీసీ బి కేటగిరీకి చెందిన స్థానిక వివాహిత మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 1, 2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేసి రసీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు మెరుగైన సేవలు



లబ్ధిదారులకు హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో నరసింహ నాయక్

కిర్లంపూడి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ అన్నారు. కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని జగపతినగరం–2లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా ? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్యాధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రోగులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు బి.రాంబాబు నాయక్, సాయిహేమాంజలి, హెచ్ఎస్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశాలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో హైస్కూల్లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శంఖవరం: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, త్రోబాల్, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంఈఓలు ఎస్‌వీ రమణ, గోవింద్, హెచ్ఎం టిభాస్కర వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బర్ర లచ్చబాబు, అడపా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కిర్లంపూడి: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు మండలం నుంచి 152 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలోని స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మండలస్థాయిలో కబడ్డీ, ఖోఖో, బాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన 73 మంది బాలురు, 79 మంది బాలికలను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు హెచ్‌ఎం ప్రకాష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు టి.జోసెఫ్, చిన్నారావు, పీడీలు నాగేశ్వరరావు, రఘుబాబు, వీఎస్‌వీ సత్యవతి, సంజన, శివానీ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్టు హెచ్‌ఎం లక్ష్మీకాంతం, పీఎంసీ చైర్మన్ పి.చిన్ని బుధవారం తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 20 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. పాఠశాల పీఎస్ ఉపాధ్యాయుడు జి.శోబాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు అందజేశారు.


చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఎ.కొత్తపల్లిలో సర్వే చేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

తొండంగి: మండలవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. గ్రామాల్లోని వైద్యారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటా పర్యటించి సర్వే చేస్తున్నారు. ఎ.కొత్తపల్లిలో బుధవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేశారు. అక్టోబర్ 3న గ్రామంలో నిర్వహించే మెగా వైద్య శిబిరంలో వీరికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పీఎస్ ఎస్ మూర్తి, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు



తునిలో ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

తుని: ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లు పెట్టే వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు ఆరుగుల సత్తిబాబు, పెదపూడి శివ, జుత్తుక మురళి, మామిడి రాజా, చీలా ప్రసాద్, గంధం మహేష్, జుత్తుక సంజయ్ తదితులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



రత్నగిరిపై విద్యా గణపతి అలంకరణలో స్వామివారు



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం స్వామివారిని విద్యాగణపతిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు స్వామివారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులు ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద భక్తి గీతాలు, భజనలు చేశారు.

ఏలేశ్వరం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం మహిళలు గణపతికి అష్టోత్తర శతనామావళి పఠించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వినాయక ఆలయంలో విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు విష్ణుసహస్రనామ పారాయణ, శివ స్తోత్రాలు, పలు పారాయణాలు చేశారు. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, గట్టెం వెంకటరమణ, గొల్లపూడి సత్యనారాయణ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, కామాక్షి, లక్ష్మీకుమారి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.